క్లుప్తంగా

ఎంబీ గార్డెన్ ఫంక్షన్ హాల్ సీజ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం బుర్హాన్‌పురంలోని ఎంబీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. తెలంగాణ మున్సిపల్ యాక్ట్–2019 ప్రకారం బుధవారం నోటీసులు జారీ అయ్యాయి. ప్రజా అవసరాలకు తగినట్లుగా ఏర్పాట్లు లేకపోగా అగ్నిమాపక శాఖ ఎన్‌ఓసీ కూడా లేకపోవడంతో సీజ్ చేస్తున్నట్లు కేఎంసీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు.

వచ్చే నెల 10న ఎన్నికలు

ఖమ్మం లీగల్: జిల్లా న్యాయవాద సంక్షేమ సహకార సంఘం ఎన్నికలు వచ్చేనెల 10న నిర్వహించనున్నట్లు ఎన్నికల సహాయ అధికారి కొలూరి స్వప్న తెలిపారు. నాలుగు డైరెక్టర్ పోస్టులకు యాసా క్రాంతికుమారి, బెండడి కుమార్, మోజెస్ క్రిస్టోఫర్, ఎం.డీ.రఫీ, పిడతల రామ్మూర్తి నామినేషన్లు వేయగా వారికి గుర్తు కేటాయించినట్లు వెల్లడించారు. ఏప్రిల్ 10న ఉదయం 10–30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, ఆ తర్వాత ఓట్లు లెక్కిస్తామని తెలిపారు. సంఘంలో మొత్తం 442 మంది సభ్యులు ఉన్నారని, సభ్యులందరూ నలుగురికి ప్రాధాన్యత ఓటు వేయొచ్చని వివరించారు.

మొక్కజొన్న పంట పరిశీలన

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను బుధవారం కూసుమంచి ఏడీఏ విజయచంద్ర, ఏఓ వాణి పరిశీలించారు. పంట నష్టం గుర్తింపు, నమోదుపై ఏఈఓలకు తగు సూచనలు చేశారు. రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, రైతులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

తిరుమలాయపాలెం: మండలంలోని కంటి వెలుగు శిబిరాన్ని మండల ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కంటి సమస్యల పరిష్కారం కోసం గ్రామ గ్రామాన కంటి వెలుగు కార్యక్రమం చేపట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, సర్పంచ్ వీరబోయిన మౌనిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

చోరీ కేసులో జైలుశిక్ష

ఖమ్మంలీగల్: ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన గుర్రం కోటేశ్వరరావుకు బంగారం చోరీ కేసులో తొమ్మిది నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి పొన్నపల్లి మౌనిక బుధవారం తీర్పుచెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం ప్రశాంతినగర్‌కు చెందిన కొల్లు సుబ్బారావు దంపతులు 2021 జనవరి 7న ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లి మరుసటి రోజు వచ్చే సరికి ఇళ్లు, బీరువా తాళాలు పగులగొట్టి ఉండగా బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దీంత సుబ్బారావు చేసిన ఫిర్యాదుతో ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈకేసులో కోటేశ్వరరావును నిందితుడిగా గుర్తించి శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీఓ ఎస్.అనిల్‌కుమార్ వాదించగా, కానిస్టేబుల్ వి.రామకృష్ణ సహకరించారు.

సౌకర్యాలు కల్పించాలి

ఖమ్మంమయూరిసెంటర్: పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో సకల సౌకర్యాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యం ఫీజుల పేరుతో హాల్‌టికెట్లు ఇవ్వడంలేదని, అటువంటి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, నాయకులు శశి, సతీష్, సాయి, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లను పరిశీలించిన కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పన్నుల వసూళ్లను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి బుధవారం పరిశీలించారు. నగరంలోని పలు డివిజన్‌లలో బిల్ కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు పన్నులు వసూలు చేస్తున్న తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పన్నులను సకాలంలో చెల్లించి ప్రజలు నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపుకు రెండు రోజులు సమయం మాత్రమే ఉండడంతో శ్రీరామ నవమి రోజు (గురువారం) నగరంలో ప్రత్యేక కేంద్రాలతో పాటు కేఎంసీ కార్యాలయాల్లో బిల్ కలెక్టర్లు అందుబాటులో ఉండి పన్నులు కట్టించుకుంటాని తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	బలగం, దసరా
సాయిరాం	బోళా
ఆదిత్య	దసరా
శ్రీనివాస	దాస్ కా దమ్కి
సుందర్	రంగ మార్తాండ

– ఖమ్మంవ్యవసాయం

రారండోయ్.. వేడుక చూద్దాం


పసుపు సిద్ధం చేస్తున్న భక్తులు

- రాములోరి పెళ్లికి మండపాలు ముస్తాబు
- ప్రత్యేక ఆకర్షణగా పర్ణశాల రామాలయం

నేడు శ్రీరామ నవమి


టేకులపల్లిలో ముస్తాబైన దేవాలయం


ముస్తాబైన పర్ణశాల రామాలయం

ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం: శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి నగరంలోని పలు దేవాలయాలు, రఘునాథపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో మండపాలు ముస్తాబయ్యాయి. ఇందిరానగర్ పర్ణశాల వద్ద గల శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గురువారం జరిగే స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు 25 వేల మంది భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లకు మామిడి తోరణాలు కట్టి సిద్ధం చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయ పరిసరాలను అందంగా అలంకరించారు. భద్రాచలం తరహాలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ముత్యాల తలంబ్రాలతో నిర్వహించనున్నారు.

పట్టు వస్త్రాలు సమర్పణ..

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ గ్రామంలో గల రామ మందిరంలో శ్రీరామనవమి సందర్భంగా బుధవారం దేవాలయంలో గ్రామానికి చెందిన అనంతుల నాగమణి, వెంకటకృష్ణ గౌడ్ లు పూజారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. గత 20 ఏళ్లుగా శ్రీరామనవమికి పట్టు వస్త్రాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న వెంకటకృష్ణ దంపతులు

నదీ జలాల ఊరేగింపు..


జలాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ ఘట్టంలో పసుపు సిద్ధం చేస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ రామనవమి వేడుకల్లో భాగంగా ఖమ్మం నగరంలోని గాంధీచౌక్‌లో కిరాణ జాగిరి మర్చంట్స్ అసోసియేషన్ బుధవారం నదీ జలాల ఊరేగింపు కార్యక్రమంతో వేడుకలను ప్రారంభించారు. నదీ జలాలను నవమి వేడుకల నిర్వహణ కమిటీ, భక్తులు ఖమ్మం నగరంలో మేళతాలాలతో సంప్రదాయ పద్ధతుల్లో ఊరేగించారు. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాములవారు, సీతమ్మను పెళ్లికి ముస్తాబు చేసి ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నిర్వహణ కమిటీ అధ్యక్షులు వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వజ్రపు మోహన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని 55వ డివిజన్‌లో ఉన్న శ్రీ పవనసుత జలాంజనేయ స్వామి మందిరంలో ఎదుర్కోలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రావణి సుధాకర్, ఆలయ చైర్మన్ మోతారపు సుధాకర్, ధర్మకర్తలు కొట్టి రాధిక, తాతినేని శ్రీనివాస్, పారా శ్రీనివాస్, నాగమణి, పద్మ, సరిత పాల్గొన్నారు.


గాంధీచౌక్‌లో నదీ జలాలతో వస్తున్న భక్తులు


స్వామివారికి అభిషేకం చేస్తున్న పండితులు

'ఆసరా' గుర్తింపు కార్డులు పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని లబ్ధిదారులకు మేయర్ పునుకొల్లు నీరజ ఆసరా గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. బుధవారం 26, 32వ డివిజన్‌లలో మేయర్ ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితరులకు ఆసరాగా నిలుస్తున్న ఈ కార్డులను నేరుగా ఇళ్ల వద్దకే చేరాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దోన్‌వాన్ సరస్వతి రవి, రాజు, బుజ్జి, సరిత, రాణి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొడుగులు వితరణ

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం నాలుగు గొడుగులను బుధవారం ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు సోమా నర్సింహారావు(జీవై నరేష్) ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేతకు అందించారు. ఎండ తీవ్రత పెరగటంతో మార్కెట్ యార్డుల్లోని గేట్ల వద్ద సెక్యూరిటీ సిబ్బంది రక్షణ కోసం ఈ గొడుగులను అందించినట్లు నర్సింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్, మిర్చి శాఖ కార్యదర్శి యడ్లపల్లి సతీష్ కుమార్, గ్రేడ్–2 కార్యదర్శి బి బజార్, వ్యాపారులు, మార్కెట్ కమిటీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఎదుట నిరసన

ఖమ్మం సహకారనగర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అనుబంధ జిల్లా మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అబ్బాస్, గౌస్, కనకరాజు, జహీర్ అలీ, ముజాహీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే


సన్నె ఉదయ్‌ప్రతాప్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎస్సీ మోర్చా ప్రభారి సన్నె ఉదయ్ ప్రతాప్ అన్నారు. బుధవారం శ్రీనివాస్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోటపర్తి సుదర్శన్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. తెలంగాణలో దళితులు, మహిళలు, రైతులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ మోర్చాను బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఎస్సీ మోర్చా కార్యాచరణపై సూచనలు చేశారు. అనంతరం సన్నె ఉదయ్‌ప్రతాప్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధర్మారపు వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యదరి చిన్ని కృష్ణ, ప్రకాశ్ రావు, రీగన్ ప్రతాప్, వీరబాబు, వీరస్వామి, విజయ రాజు, మంద సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


కిషోర్‌కుమార్‌కు నియామకపత్రం అందిస్తున్న లక్కినేని సుధీర్‌బాబు

ఖమ్మంమయూరిసెంటర్: పాలేరు నియోజకవర్గంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీని బలోపేతం చేసి షర్మిలను గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాలేరు నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడిగా బానోత్ కిషోర్‌కుమార్‌ను నియమించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేయాలని, యువతను పార్టీలోకి పెద్ద ఎత్తున చేర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పాసంగులపాటి రాఘవ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త బాలాజీరావు, పాలేరు మండల అధ్యక్షులు రూప్లా నాయక్, వాలూరి సత్యనారాయణ, ఎడపల్లి వెంకయ్య, బానోతు ఉపేందర్, లావూరి కోటేశ్వరావు, జర్పుల కోటేష్, తుపాకుల వెంకన్న, సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

నియామకం..

కూసుమంచి: వైఎస్సాఆర్‌టీపీ యువజన విభాగం పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలంలోని ఎర్రగడ్డతండాకు చెందిన బానోత్ కిషోర్‌నాయక్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు నియామక ఉత్తర్వులు అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బాలాజీరావు, మండలాల అధ్యక్షులు వైవీడీ రెడ్డి, వాలూరి సత్యనారాయణ, రూప్లా నాయక్, ఎండ్లపల్లి వెంకయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టొద్దన్నందుకు దాడి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువులో సొసైటీ ఎన్నికల తర్వాతే చేపలు పట్టాలని చెప్పడంతో పాటు అధికారులకు ఫిర్యాదు చేసినందుకు తనపై దాడి చేశారని గ్రామానికి చెందిన పాల్త్యా కోట్యానాయక్ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ చెరువులో చేపల వేటకు కొందరు సభ్యులే కాంట్రాక్ట్ దక్కించుకునే యత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇదే విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, కొందరు సభ్యులు మాట్లాడాలని పిలిపించి దాడి చేయడమే కాక కులం పేరుతో దూషించారని వాపోయారు. ఈ మేరకు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

స్వచ్ఛోత్సవ్ ర్యాలీ


స్వచ్ఛోత్సవ్ ర్యాలీలో పాల్గొన్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: స్వచ్ఛోత్సవ్–2023 కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని సుగ్గలవారి తోట వీధిలో మెప్మా, మున్సిపల్, కార్పొరేటర్లు, ప్రజలతో స్వచ్ఛత మాషాల్ మార్చ్ (ప్రతిజ్ఞ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు స్వచ్ఛతను పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ.. గృహాలు, దుకాణ యజమానులు తమ చుట్టూ అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూసుకోవాలని సూచించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు, బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధించబడిందని తెలిపారు. తడి చెత్తను ఇంట్లోనే కంపోస్ట్ ఎరువుగా మార్చుకొని ఇంటి పెరటి మొక్కలకు ఎరువుగా వాడుకునే దిశగా ప్రజలు ఆలోచన చేయాలని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్(సిటీ బస్టాండ్) వద్ద ఫీడ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఫీడ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ ఫర్హా మహ్మద్ సౌజన్యంతో ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఎస్ఎం రఘుబాబు, ఫౌండేషన్ ప్రతినిధులు కన్నోజు కిరణ్‌కుమార్, సబిత, ప్రియ, అన్నపూర్ణ, సీహెచ్. రమేష్, రచ్చ రామారావు, టీవీ రాజు, ఎస్‌డీ పాషా, హనుమంత రావు, జానకి రాములు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

ఖమ్మం సహకారనగర్: గత పది రోజులుగా స్వేచ్ఛ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్రిటెక్ ఇంటర్న్‌షిప్ బుధవారంతో ముగిసినట్లు ఎస్‌బీఐటీ చైర్మన్ జి.కృష్ణ తెలిపారు. వ్యవసాయ ఆధారిత అంశాలపై అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు


ఖమ్మంఅర్బన్: టీడీపీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న కూరపాటి వెంకటేశ్వర్లు


నేలకొండపల్లిలో జెండాను ఎగురవేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు ఆరెకట్ల కొండలరావు

తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయాలు, ప్రధాన సెంటర్లలో పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుర్పించి స్వీట్లు పంచారు.

– నేలకొండపల్లి/ఖమ్మంఅర్బన్

ఘనంగా 'స్మార్ట్ కిడ్జ్' వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ, కరస్పాండెంట్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల 11వ వార్షికోత్సవాన్ని నగరంలోని సప్తపది ఫంక్షన్ హాల్లో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్ పునుకొల్లు నీరజ, పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ సుకన్య, ఫేమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు, వైద్యురాలు ప్రశాంతి, వ్యక్తిత్వ వికాస నిపుణులు అట్లూరి వెంకటరమణలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్న పాఠశాల యాజమాన్యం పనితీరు అభినందనీయమని, బాల్యంలో నేర్చుకున్న విద్యే రేపటి భవిష్యత్తును నిర్ణయిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అందరిని ఆకట్టుకోగా.. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పందులను తరలించకపోతే విద్యుత్, రేషన్ కట్

నేలకొండపల్లి: ఊరు మధ్య నుంచి పంచాయతీ కేటాయించిన స్థలంలోకి పందులను తరలించకపోతే పెంపకందారుల విద్యుత్, రేషన్, ఫించన్లు నిలిపివేస్తామని అధికారులు హెచ్చరించారు. మండలంలోని చెరువుమాధారంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపీడీఓ కె.జమలారెడ్డి మాట్లాడారు. ఇళ్ల మధ్య పందుల పెంపకంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యాన వారం రోజుల్లోగా బయటకు తరలించాలని సూచించారు. సర్పంచ్ ఈవూరి సుజాత, ఎంపీఓ సీ.హెచ్.శివతో పాటు ఆకుల వెంకటేశ్వర్లు, ముప్పడి వెంకటేశ్వర్లు, ఈవూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్‌లో శిక్షణ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు పోటీ పరీక్షల్లో బహుళైచ్ఛిక ప్రశ్నలను అర్థం చేసుకోవడంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బీవీ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ సీతారాం మాట్లాడారు. అనంతరం సీతారాం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంపూర్ణ రచనల ప్రతులను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి డాక్టర్ కె.పద్మారాణి, అధ్యాపకులు కృష్ణవేణి, సీహెచ్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ


పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న రవీందర్‌రెడ్డి


రఘునాథపాలెం: పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ సంజీవరావు


మెటీరియల్ అందిస్తున్న కమిటీ బాధ్యులు

నేలకొండపల్లి/రఘునాథపాలెం/తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్: నేలకొండపల్లి మండలంలోని బోదులబండ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు(1983–84 బ్యాచ్) కమిటీ ఆధ్వర్యంలో పరీక్ష మెటీరియల్లను అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం నిర్మల, పూర్వ విద్యార్థులు పెంటి రామారావు, యర్రా రవీందర్‌రావు, కాకాని రాంబాబు, కాకాని ధనమూర్తి, ఆళ్ల వెంకటనర్సయ్య, ఉపాధ్యాయులు బి.రామారావు, నవీన్, రిటైర్డ్ హెచ్ఎం అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ ఉన్నత పాఠశాలలో అమ్మ ఫౌండేషన్, మంచుకొండ కృపయోజన సంఘం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మందా సంజీవరావు మాట్లాడుతూ తుది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి రూ.5వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ట్రెజరర్ మండా నాగమణి, ఉపాధ్యక్షులు మారుపాక పృథ్వీ, గౌరవ అధ్యక్షుడు పసలపూడి రమేష్, సలహాదారులు చిన్ని డేవిడ్, పి. రవికిరణ్, హెచ్ఎం అంజన్‌రావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు జెడ్పీ పాఠశాలలో పది విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి అందించిన పరీక్ష ప్యాడ్లను గ్రామ సర్పంచ్ అందజేశారు. ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లి పాఠశాల విద్యార్థులకు వైఎస్సార్ టీపీ నాయకుడు బత్తిని వేలాద్రి అందించిన పరీక్షప్యాడ్లను వైఎస్ షర్మిలపీఏ నంద్యాల రవిందర్‌రెడ్డి విద్యార్థులకు అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, హెచ్ఎం మోహన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థినులకు వీడ్కోలు..


విద్యార్థినులతో ఉపాధ్యాయులు



కూసుమంచి: నగదు అందజేస్తున్న ఎంపీపీ

నేలకొండపల్లి/కూసుమంచి/తిరుమలాయపాలెం: మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు కార్యక్రమాలు నిర్వహించారు. వార్షిక పరీక్షల నేపథ్యాన ఆయా పాఠశాలల యాజమాన్యం కమిటీ, ఉపాధ్యాయుల సమన్వయంతో నేలకొండపల్లి మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, కూసుమంచిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడు జెడ్పీ పాఠశాలలో వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా విద్యార్థినులకు పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, మెటీరియల్స్, పెన్నులు వంటి పరీక్ష సామగ్రి అందజేశారు. అనంతరం విద్యార్థులు ఆట,పాటలతో అలరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, హెచ్ఎంలు మాట్లాడుతూ కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని, ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ప్రోత్సాహాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్, సర్పంచ్ చెన్నా మోహన్, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, ఎస్ఎంసీ చైర్మన్లు మహిమూదా, కామల్ల వీరయ్య, హెచ్ఎంలు పార్థసారథి, రేల విక్రంరెడ్డి, శ్రీలత, మాజీ సర్పంచ్ భూక్యా వీరన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.